
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
గురువారం 26 డిసెంబరు 2024
జిల్లాల వార్తలు



ఆల్ప్రాజోలం పట్టివేత.. పరిశ్రమ సీజ్

గుమ్మడిదల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల పీఎస్ పరిధిలోని శ్రీవత్స లైఫ్ సైన్స్ పరిశ్రమలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు బుధవారం 32 కిలోల ఆల్ప్రాజోలం పట్టుకున్నారు. పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ ఏపీలోని కృష్ణ జిల్లాకి చెందిన రమేష్‌రెడ్డితో కలిసి రియాక్టర్లలో మత్తుమందు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు రమేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని, శ్రీవత్స లైఫ్ సైన్స్ పరిశ్రమను సీజ్ చేశారు.

వనదుర్గా సన్నిధిలో

క్రీస్తు సన్నిధిలో..

ఏడుపాయల దర్శనం..
ఏసయ్యకు వందనం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్యాత్మిక పర్యటన ● అమ్మవారిని దర్శించుకున్న తొలి సీఎంగా గుర్తింపు
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు.. ప్రత్యేక పూజలు ● రేవంత్‌ను చూసేందుకు తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజలు
- మెదక్ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి ● సీఎం రాకతో అట్టహాసంగా క్రిస్మస్ సంబరం, నూరేళ్ల వేడుక
- ఆలయం, చర్చిల వద్ద భారీ బందోబస్తు ● అభివృద్ధి పనులకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి శంకుస్థాపన
- రెండు గంటల్లోనే ప్రశాంతంగా ముగిసిన సీఎం టూర్



ఏడుపాయల వనదుర్గామాతకు పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మెదక్ చర్చి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

'ఇటు ఏడుపాయల వనదుర్గమ్మ దర్శనం.. అటు మెదక్ చర్చిలో ఏసయ్యకు క్రిస్మస్ వందనం' పేరిట బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ఆధ్యాత్మిక పర్యటన అట్టహాసంగా, ప్రశాంతంగా కొనసాగింది. ఏడుపాయలకు విచ్చేసిన తొలిముఖ్యమంత్రిగా గుర్తింపు దక్కించుకున్న సీఎం.. ప్రభుత్వం తరపున ఏడుపాయల వనదుర్గామాతకు పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకుల ఆశీర్వచనాలు పొందారు. ఇక శతాబ్ది వేడుకలతో విరాజిల్లుతున్న మెదక్ చర్చిలోనూ అడుగుపెట్టి క్రిస్మస్ సంబరాలకు హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల రూపంలో పాస్టర్ల ఆశీర్వాదాలు స్వీకరించారు. మాట ఇచ్చినట్లుగానే చర్చికి వచ్చానని, మెదక్ అభివృద్ధికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. రేవంత్ వెంట టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు రఘునందన్‌రావు, సురేష్ షెట్కార్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఉన్నారు. సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి,సంగారెడ్డి/మెదక్/పాపన్నపేట, డిసెంబరు25

తొలిసారిగా ఏడుపాయలకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావుతో కలిసి రూ.409.58 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా సీఎంకు, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్‌బాబు, ఈవో చంద్రశేఖర్ మేళ తాళాల మధ్య అర్చకులు ఘనంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. స్థానిక ఎమ్మెల్యే ముఖ్యమంత్రి, మంత్రులకు, ఎంపీ, ఎమ్మెల్యేలకు వనదుర్గా అమ్మవారి ఫొటోతో కూడిన మెమెంటోలను అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం మెదక్ జిల్లా, నియోజకవర్గ అభివృద్ధి, ఏడుపాయల అభివృద్ధి పనులకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రూ.409.58 కోట్ల పనులకు సీఎం మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఏడుపాయల ఆలయానికి వచ్చే ప్రధాన రహదారిని రెండు లేన్లతో పాటు డివైడర్, ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుకు రూ. 35కోట్లు, మెదక్ జిల్లా కేంద్రంలో మహిళా స్త్రీ శక్తి భవన నిర్మాణం కోసం రూ.5కోట్లు, గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణం కోసం రూ.52.76 కోట్లు, రూ.205 కోట్లతో యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు రూ.7.4కోట్ల పనులకు శంకుస్థాప చేశారు. అలాగే రూ.102 కోట్ల32 వేల 40 వేల చెక్కును ముఖ్యమంత్రి స్వయం సహాయక సంఘాల మహిళలకు

మిగతా 7వ పేజీలో...



స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూప్ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి, ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యే



మెదక్ సీఎస్ఐ చర్చి శతాబ్ది వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. చర్చి ప్రాంగణంలో రూ.29.30 కోట్ల అంచనా విలువతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన గావించారు. అనంతరం చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సీఎంకు చర్చి కట్టడాలను సీఎస్ఐ సభ్యులు వివరించారు. గోథిక్ శైలిలో నిర్మించిన వాస్తు నైపుణ్యాలను వివరించగా ఆయన అబ్బురపడ్డారు. చర్చి ప్రాంగణంలోని మూడు గవాక్షాలలో రంగుటద్దాలతో నిర్మించిన క్రీస్తు పునరుద్ధానం, జీసెస్ జన్మవృత్తాంతం, శిలువపై వేలాడుతున్న ప్రభువు చిత్రాలను తిలకించి ఆనాటి చిత్రకారుల పనితనాన్ని మెచ్చుకున్నారు. అనంతరం సందర్శకుల డైరీలో సంతకం చేశారు. అద్భుత కట్టడాన్ని ప్రశంసించారు.

రూ. 750 కోట్ల పనులకు శంకుస్థాపన

మెదక్ నియోజకవర్గంలో రూ.750 కోట్ల అంచనా విలువతో చేపట్టే పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మెదక్ పట్టణంలో రూ.5కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇందిరా మహిళా శక్తి భవన పనులు, మెదక్ చర్చిలో భక్తులకు విడిది సదుపాయాలు, సిమెంటు రోడ్ల నిర్మాణం, జీసెస్ విగ్రహం నిర్మాణ పనులకు శంకుస్థాపన గావించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలు ఏర్పాటుకు రూ.203 కోట్లు కేటాయించారు. సీఎం రాకతో పోలీసులు సీఎస్ఐ కాంపౌండ్‌ను పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. పలు ఆంక్షలను అమలు చేయడంతో భక్తులు పలు ఇబ్బందులకు గురయ్యారు. సీఎం పర్యటన ముగిసిన తర్వాత భక్తుల సందర్శనలు యథావిధిగా కొనసాగాయి. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలతో పాటు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, కౌన్సిలర్లు రాజు, లింగం, శేఖర్, నిఖిల్, దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు అరునార్తి వెంకటరమణ, ఉప్పల రాజేష్, సమీయోద్దీన్, బొజ్జ పవన్, సలీమ్, చర్చి అభివృద్ధి కమిటీ చైర్మన్ బానీ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మెదక్ చర్చి నమూనాను అందజేస్తున్న చర్చి కమిటీ సభ్యులు సంపత్, సాంసన్ సందీప్ తదితరులు

తెలంగాణలో టీడీపీ జెండా ఎగుర వేస్తాం

- అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయండి
- తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జైరామ్‌చందర్



జైరామ్‌చందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాయికోడ్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జైరామ్‌చందర్ అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని కర్చల్ గ్రామంలో జహీరాబాద్ పార్లమెంట్ తెలుగు యువత విస్తృత స్థాయి సమావేశంతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, జహీరాబాద్ పార్లమెంట్ కోశాధికారి పట్లోళ్ల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జైరామ్‌చందర్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీలకు ప్రాణమని, వారు లేక పోతే పార్టీల మనుగడ కష్టమన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాబోవు రోజుల్లో పార్టీలోకి యువతను పెద్దసంఖ్యలో స్వాగతిస్తామన్నారు. తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసమే స్వర్గీయ ఎన్‌టీఆర్ తెలుగు దేశం పార్టీని స్థాపించారని, అన్నివర్గాల ప్రజలు అండగా నిలబడాలన్నారు. ఎన్‌టీఆర్ ఆశయ సాధనకు యువత పాటుపడాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, ఏడాది కాంగ్రెస్ పాలనతో తెలంగాణ అభివృద్ధి శూన్యమన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కిరణ్‌చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్పెషల్ దోపిడీ

● 50 శాతం ఛార్జీల పెంపు 8 లో

మెదక్ చర్చి.. కిక్కిరిసి..



● ఘనంగా క్రిస్మస్ వేడుకలు

మెదక్ సీఎస్ఐ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు వేలాదిగా తరలి రావడంతో చర్చి పరిసరాలు కిక్కిరిసాయి. చర్చి ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో వేకువ జాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కాగా, భక్తులు శిలువ వద్ద కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. భక్తుల రాకపోకలతో చర్చి ప్రధాన ద్వారం భక్తజనసంద్రంగా మారింది.

-మరిన్ని ఫొటోలు 7వ పేజీలో..



సేంద్రియ సేద్యం అభినందనీయం

- మెదక్ రైతులు చరిత్ర సృష్టించారు
- ఢిల్లీకి వచ్చి ఆతిథ్యాన్ని స్వీకరించండి
- ఉప రాష్ట్రపతి జగదీప్‌ధన్‌కర్
- తుంకి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులతో సమ్మేళనం
- హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మంత్రి సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు



రైతుల సమ్మేళనంలో ఉపరాష్ట్రపతి, గవర్నర్, మంత్రి తదితరులు

నర్సాపూర్/కౌడిపల్లి, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వాడకంతో కలుగుతున్న అనర్థాల నేపథ్యంలో కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో రైతులు సేంద్రియ సాగు దిశగా సాగడం అభినందనీయమని దేశ ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌కర్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తుంకి సమీపంలో ఏకలవ్య ఫౌండేషన్ నేతృత్వంలో కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తున్న 800 మంది రైతులతో సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌కర్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు హాజరయ్యారు. మొదటగా హెలికాప్టర్‌లో ఇక్కడకు చేరుకున్న ఉపరాష్ట్రపతి, ఇతర ప్రముఖులు మొక్క నాటి సేంద్రియ ఎరువుల సంబంధించిన స్టాల్స్, పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని 655 మంది రైతు కుటుంబాలు సేంద్రియ సేద్యం చేపట్టి దేశంలోనే చరిత్ర సృష్టించారని కితాబునిచ్చారు. వీరంతా ఢిల్లీకి వచ్చి మూడురోజులపాటు అక్కడే ఉండి తన ఆతిథ్యం స్వీకరించాలని ఆహ్వానించారు. భారత ఆర్థిక వ్యవస్థలో రైతుల భాగస్వామ్యం ఉంటేనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో పండించిన పండ్లు, కూరగాయలను ఒక యూనిట్ ఏర్పాటు చేసుకుని అక్కడే వినియోగించుకోవాలన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ జిల్లాలో ఇంతమంది రైతులు ఆర్గానిక్ వ్యవసాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అఖిల భారతీయ కార్యకారిని సదస్యులు బడ్ల బాగయ్య, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా సేంద్రియ సేద్యం చేస్తున్నా : ధనలక్ష్మి

తుంకి సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో గత ఐదేళ్లుగా తమ పొలంలో కేవలం సేంద్రియ ఎరువులతోనే కూరగాయలు, వరి పంట పండిస్తున్నానని చిలప్‌చెడ్ మండలం బండపోతుగల్ గ్రామానికి చెందిన మహిళా రైతుల ధనలక్ష్మి తెలిపారు. ఉపరాష్ట్రపతితో

- మిగతా 7వ పేజీలో...

రాష్ట్ర ప్రభుత్వం హిందువులను అడ్డుకుంటోంది

- శౌర్యయాత్రకు కోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నాం..
- బజరంగ్‌దళ్ అఖిల భారతీయ సంయోజక్ నీరజ్ దొనేరియా



7 లో

సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టుకు బంగారు పతకం

మనోహరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టుకు బంగారు పతకం గెలుపొందిందని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు తెలిపారు. జమ్మూ కాశ్మీర్‌లో 20 నుంచి 24 వరకు 37వ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. తెలంగాణ నుంచి 16 మందితో కూడిన సబ్ జూనియర్ బాలికల జట్టు పాల్గొన్నది. ఫైనల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ టీం పోటీపడగా.. ఆంధ్రప్రదేశ్ టీంపై తెలంగాణ టీం 3 రన్స్ తేడాతో గెలుపొంది బంగారు పతకాన్ని కైవసం చేసుకుందన్నారు. మెదక్ జిల్లా నుంచి నలుగురు బాలికలు పాల్గొన్నారు. గెలుపొందిన టీంను సాఫ్ట్‌బాల్ కోచ్ రవి అభినందించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

● రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్

అక్కన్నపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బీ.రవీందర్‌నాయక్ సూచించారు. బుధవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఓపీ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ స్టోర్, ల్యాబొరేటరీ, వార్డులను సందర్శించారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్య అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు ఎప్పటికప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలు గర్భిణులను 102 వాహనాల ద్వారా ట్యాగ్ సెంటర్లకు తీసుకురావాలని చెప్పారు. సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. అన్నిరకాల ఆరోగ్య కార్యక్రమాలు 100 శాతం పూర్తిచేసి రాష్ట్రంలోనే జిల్లాను మొదటిస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇందులో డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు ఆనంద్, శ్రీకళ, వైద్యాధికారి వినోద్ రెడ్డి, ఏవో నవీన్ రాజ్ కుమార్, సిహెచ్‌వో శబ్ద ప్రకాష్ పాల్గొన్నారు.




నిందితుల వివరాలు వెల్లడిస్తున్న చేర్యాల సీఐ శ్రీను, నిందితుల వద్ద పట్టుబడిన గంజాయి, సెల్‌ఫోన్లు

చేర్యాలలో గంజాయి పట్టివేత

● నలుగురు యువకుల అరెస్ట్, రిమాండ్

చేర్యాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నలుగురిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చేర్యాల సీఐ శ్రీను నిందితుల వివరాలను వెల్లడించారు. పట్టణంలోని పెద్దమ్మగడ్డ కాలనీకి చెందిన రాసూరి నవీన్, మండలంలోని చుంచనకోటకు చెందిన పొన్నబోయిన పవన్, చెట్కూరి శ్రావణ్, ఏశబోయిన కరుణాకర్ ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లోని పలు ప్రదేశాల్లో, వైన్‌షాప్‌ల ఆవరణలో చుడువా అమ్ముకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో గంజాయికి అలవాటుపడి తమ స్నేహితులకు అలవాటు చేశారు. తమ జల్సాల కోసం గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి స్థానికంగా స్నేహితులకు విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు పట్టణ శివారులోని మల్లికార్జున వెంచర్‌లో నిందితులను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వారి నుంచి 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, 4 సెల్‌ఫోన్లు, ఆటోను పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపించామని తెలిపారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి

● లెఫ్టినెంట్ కల్నల్ రమేష్ సారియాల్



ఎన్‌సీసీ కేడెట్లను ఉద్దేశించి ప్రసంగిస్తున్న రమేష్ సారియాల్

కంది, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో పాటు, దేశభక్తి కూడా అవసరమని తెలంగాణ 33 యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రమేష్ సారియాల్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈనెల 21 నుంచి 30 వరకు సీఏసీటీ-8 పేరుతో ప్రత్యేక ఎన్‌సీసీ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరానికి సంగారెడ్డి, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి 400 మంది ఎన్‌సీసీ కేడెట్లు హాజరయ్యారు. ఈ శిబిరంలో ఎన్‌సీసీ కేడెట్లకు ఫిజికల్ ఫిట్నెస్, ఆర్మీ పరేడ్, తుపాకీ శిక్షణ వంటి అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం ఈ శిబిరానికి నేతృత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ రమేష్ సారియాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్లకు ఇది ఒక ప్రత్యేక శిక్షణ అని, దేశభక్తిని పెంపొందించుకునేందుకు మార్గమని తెలిపారు. ఐఐటీ హైదరాబాద్‌లో శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ శిబిరంతో ఎన్‌సీసీ కేడెట్లు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని ఐఐటీహెచ్ డాక్టర్ దిగ్విజయ్ పవర్ పేర్కొన్నారు.

ప్రభువుకు ప్రణమిల్లి..

మెదక్ సీఎస్ఐ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు





చర్చిలో ప్రదక్షిణలు

దేశంలోనే అతిపెద్ద సీఎస్ఐ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో చర్చి లోపల బయట.. పరిసరాల్లో ఎటు చూసినా సువార్తీకులే కనిపించారు. వేకువజామున 4.30 నుంచే ఇంచార్జి బిషప్ రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి వేడుకలను ప్రారంభించారు. తొలి ఆరాధనలో ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ దైవ సందేశాన్ని వినిపిస్తూ క్రిస్మస్ అంటే మానవాళి జీవితాలలో వెలుగునింపడానికి ఏసు ఈ రోజు వెలుగై వచ్చాడన్నారు. మహాదేవాలయం విశ్వసనీయతకు రూపం అన్నారు. రెండో ఆరాధనలో ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశమిచ్చారు. ఏసు ప్రేమగల దేవుడని ప్రపంచ మానవాళికోసం తన రక్తాన్ని ధారబోసారని ఆయనకు మరణం లేదని అన్నారు. - మెదక్ కల్చరల్, ఆంధ్రజ్యోతి



చర్చి వద్ద యువతులు



శిలువ వద్ద కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



యువతి భక్తిభావం



చర్చికి వచ్చే ప్రధాన రహదారి వద్ద జనం



ఆశీర్వచనం అందిస్తూ..

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

పుల్‌కల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పులకల్ పోలీస్‌స్టేషన్ పరిధి చౌటకూర్ మండలం శివంపేట గ్రామానికి చెందిన దేవుని హరీశ్‌కుమార్ (23) మంగళవారం రాత్రి టీఎస్ 15ఈఎం 0766 నంబరు బైక్‌పై పుల్కల్ వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. సింగూరు-సంగారెడ్డి ప్రధాన రహదారి పక్కన గంగోజిపేట గ్రామశివారులో ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన హరీశ్‌కుమార్‌ను 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో బుధవారం మృతి చెందారు. మృతుడి తండ్రి దేవుని మల్లేశం పిర్యాదు మేరకు పుల్‌కల్ ఎస్ఐ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వచ్చి వెళ్తూ..



అంగడి శ్రీకాంత్ (ఫైల్)

రామాయంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంధువుల శుభకార్యానికి వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి పొలంలో పడి ఊపిరాడక ఓ యువకుడు మృతి చెందాడు. ఘటన రామాయంపేట మండల పరిధి ఝాన్సీ లింగాపూర్ శివారులో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. చిన్న శంకరంపేట మండలం టి.మాందాపూర్ గ్రామానికి చెందిన అంగడి శ్రీకాంత్ (35) ఇదే మండలం అక్కన్నపేటలోని బంధువుల శుభకార్యానికి వచ్చాడు. రాత్రి కావడంతో సంకాపూర్‌లోని అత్తగారింటికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లాడు. దీంతో బురదగుంటలో ఊపిరాడక అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం చేరవేయగా, వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

రామాయంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. బస్వాపూర్ గ్రామానికి చెందిన పుట్టి ఏసు (36) మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు తరచుగా భార్య సుమలతను వేధింపులకు గురి చేస్తూ, గొడవ పడేవాడు. మద్యం తాగేందుకు భార్య సుమలతను డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వక పోవడంతో గ్రామంలోని దుర్గమ్మ ఆలయం వద్ద పురుగుల మందు తాగి పడిపోయారు. గమనించిన స్థానికులు భార్యకు సమాచారం అందించారు. సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా, బుధవారం చనిపోయాడు. ఎస్ఐ క్రాంతి కుమార్ పాటిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం?

మద్దూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో జరిగిన పంచాయతీ నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని మర్మాముల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సుందరగిరి బాల్‌రాజ్ దివ్యాంగుడు. అతనికి గ్రామానికి చెందిన కొందరితో భూ పంచాయతీ నడుస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్‌సెల్‌తో పాటు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పరిష్కారానికి స్థానిక పోలీసులు చొరవ చూపకపోవడంతోపాటు భూ పంచాయతీ విషయం పరిష్కారానికి నోచుకోకుండా పోవడం, ప్రత్యర్థుల బెదిరింపుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన సుందరగిరి బాల్‌రాజ్ భార్య రాధిక బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఆమెను 108 ఆధ్వర్యంలో చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే, ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.







సీఎస్ఐ చర్చి వద్ద సీఎం అభివాదం, సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, పక్కన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, వనదుర్గామాత ఆలయంలో సీఎం రేవంత్‌రెడ్డి

ఏడుపాయల దర్శనం.. ఏసయ్యకు వందనం

5వ పేజీ తరువాయి..

అందించారు. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి స్థానిక నాయకులకు, కార్యకర్తలతో కరచాలనం చేస్తూ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ మెదక్ చర్చి శతాబ్ది వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లారు. కార్యక్రమంలో జూకల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, నీలం మధు ముదిరాజ్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, చీఫ్ సెక్రటరీ సంగీత, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో పాటు స్థానిక నాయకులు జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత అప్ప, సుప్రభాత రావు, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మెదక్ జిల్లా ఇన్‌చార్జి ఆంజనేయులు, దుబ్బాక ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట ఇన్‌చహరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, నాయకులు భూమయ్య, సతీష్, నరేందర్ గౌడ్ జనార్దన్ రెడ్డి, గౌస్, శ్రీనివాస్ తోపాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎస్ఐ చర్చి వద్ద అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ముఖ్యమంత్రి రాకతో ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలన్నీ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లాయి. హెలీకాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలుదేరిన సీఎం రేవంత్‌రెడ్డి కొల్చారానికి 12:20 నిమిషాలకు చేరుకున్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్, నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి 12.35 నిమిషాలకు వనదుర్గామాత ఆలయానికి చేరుకున్నారు. 12:45 నిమిషాలకు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పూజా కార్యక్రమాలు, సన్మాన కార్యక్రమాలు అనంతరం ఆలయ ప్రాంగణంలో మెదక్ జిల్లా అభివృద్ధి పనులతో పాటు నియోజకవర్గ ఏడుపాయల అభివృద్ధి పనులకు వెంట వచ్చిన మంత్రులతో కలిసి భూమి పూజ చేశారు.

ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ

అందరికీ అందుబాటులో వైద్యం అందించే దిశగా మెదక్ మెడికల్ కళాశాలకు 20 ఎకరాల భూమితోపాటు రూ.250 కోట్లు మంజూరు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సీఎంకు వినతి పత్రం అందజేశారు. ప్రజాఆరోగ్యం సంరక్షణతోపాటు వైద్య విద్యను బలోపేతం చేయడం, జిల్లా సమగ్ర అభివృద్ధికి మీ డైనమిక్ నాయకత్వంలో తోడ్పటుపాటు అందించాలని కోరారు. ఏడుపాయల క్షేత్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి భక్తులకు శాశ్వత సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ అప్ప, సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి వినతులు సమర్పించారు.

సేంద్రియ సేద్యం అభినందనీయం

5వ పేజీ తరువాయి..

సమ్మేళనంలో ఆమె మాట్లాడుతూ కేవీకే కేంద్రం తమకు 16 రకాల దేశీయ రకాల విత్తనాలు ఉచితంగా అందిస్తుందని, వాటితోనే తాము రసాయన ఎరువుల వాడకుండా పంటలు పండిస్తున్నామన్నారు. తాను ఓ వైపు వ్యవసాయం చేస్తూనే మరోవైపు అంగన్‌వాడీ టీచర్‌గా కూడా పనిచేస్తున్నానని, తమ కేంద్రంలోని పిల్లలకు సేంద్రియ కూరగాయాలు వండి పెడుతున్నట్లు చెప్పారు.

నాడు ఎకరాలో.. నేడు 10 ఎకరాల్లో : నరేందర్‌రెడ్డి

12 ఏళ్ల క్రితం ఒక ఎకరాతో ప్రారంభమైన తన సేంద్రియ వ్యవసాయం.. నేడు 10 ఎకరాలకు విస్తరించినట్లు కొల్చారం మండలం సంగాయిపేటకు చెందిన నరేందర్‌రెడ్డి తెలిపరు. సేంద్రియ సాగుతో కొంత దిగుబడి తగ్గినా.. స్వచ్ఛమైన ఆహార ధాన్యాలు లభిస్తాయన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో సేంద్రియ పంటలకు అధికంగా డిమాండ్ ఉందన్నారు. ఫలితంగా మంచి ధర పలుకడంతో దిగుబడి తగ్గినా లాభాలు అధికంగా ఉంటున్నాయన్నారు. రైతులందరూ సేంద్రియ సాగుపై దృష్టి సారించాలన్నారు.



గిరిజన మహిళలతో పాటు నృత్యం చేస్తున్న ఉపరాష్ట్రపతి తదితరులు

బ్యాటరీ రీ సైక్లింగ్ పరిశ్రమ వద్దు

జిన్నారం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాళ్లకత్వ గ్రామ శివారులోని సర్వే నంబరు 286లో గల అసైన్డ్ భూముల్లో ఏర్పాటు చేస్తున్న వాహనాల బ్యాటరీ రీ రీసైక్లింగ్ పరిశ్రమను వెంటనే నిలిపేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. బుధవారం పరిశ్రమ ఎదుట ఆందోళన చేసి మాట్లాడారు. వాహనాల బ్యాటరీల రీ సైక్లింగ్‌తో భారీగా కాలుష్యం వెలువడి నీటి వనరులు, వ్యవసాయ రంగం దెబ్బ తింటుందని పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా.. పరిశ్రమ మూసివేతకు ఆదేశాలు ఇచ్చినా.. తిరిగి పనులు చేపట్టారని నాయకులు రామకృష్ణ తెలిపారు. అసైన్డ్ భూమిలో పరిశ్రమ ఏర్పాటుపై తహసీల్దార్ భిక్షపతిని కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం హిందువులను అడ్డుకుంటోంది

శౌర్యయాత్రకు కోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నాం..

గోమాత రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతాం

బజరంగ్‌దళ్ అఖిల భారతీయ సంయోజక్ నీరజ్ దొనేరియా





జోగిపేటలో జరిగిన శౌర్యయాత్రలో మాట్లాడుతున్న నీరజ్ దొనేరియా, బజరంగ్‌దళ్ కార్యకర్తల ర్యాలీ

జోగిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమ మతానికి చెందిన ఏ కార్యక్రమాన్నీ చేయనీయకుండా... హిందువులను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని బజరంగ్‌దళ్ అఖిల భారతీయ సంయోజక్ నీరజ్ దొనేరియా ఆరోపించారు. బుధవారం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శౌర్యయాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.... కేవలం హిందువులనే ప్రభుత్వం టార్గెట్ చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. తాము శౌర్యయాత్ర చేపడతామని పర్మిషన్ అడిగితే.. ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. చివరికి మెజారిటీ ప్రజలైన హిందువులు(తాము) హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించిందని, ఇది తీవ్ర ఆక్షేపణీయమన్నారు. తమది హనుమంతుని సైన్యమని, తాము ఎంతటి కఠినమైన కార్యక్రమమైనా సులువుగా చేస్తామని, ఎన్ని అడ్డంకులు కల్పించినా సనాతన ధర్మ పరిరక్షణ కోసం సదా నిలిచి ఉంటామన్నారు. హిందుత్వాన్ని అంతం చేయడానికి కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని, కానీ తాము వాటినన్నింటినీ తిప్పికొడతామన్నారు. హిందూతమతాన్ని అంతం చేయాలనుకునేవారు డెంగ్యూ, మలేరియా లాంటి వారని, వారు ఎక్కడ ఉన్నా.. వెతికి మరీ అంతం చేస్తామని ఈ సందర్భంగా నీరజ్‌దొనేరియా అన్నారు. గతంలో వానర సైన్యం లంకకు వెళ్లి మరీ రాక్షసుల్ని హతమార్చిందని, అలాగే తాము కూడా.. హిందూ వ్యతిరేకుల అంతం చూస్తామన్నారు. హిందువుల రక్షణ కోసం బజరంగ్‌దళ్ నిరతరం పనిచేస్తుందన్నారు. ప్రతీ గ్రామంలోనూ బజరంగ్‌దళ్ కార్యకర్తలు సైనికుల వలే సదా సిద్ధంగా ఉంటారన్నారు. లవ్‌జిహాద్‌ల నుంచి హిందూ బాలికలను రక్షించేందుకు కంకణబద్ధులమై పనిచేస్తామన్నారు. గోమాతల రక్షణ తమ కర్తవ్యమని, అందుకోసం ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటామన్నారు. గత 20 ఏండ్లలో సుమారుగా 90 లక్షల గోవులను కాపాడిన ట్రాక్ రికార్డ్ బజరంగ్‌దళ్ సొంతమని, దీనినిని ఎల్లకాలం నిర్వర్తిస్తూనే ఉంటామన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం శివాజీ, భగత్‌సింగ్, సుభాస్ చంద్రబోస్‌లు నడిచిన బాటలోనే ప్రయాణిస్తామన్నారు. దేశ సరిహద్దుల వద్ద సైన్యం ప్రజలకు రక్షణగా ఉన్నట్టే, దేశంలోని హిందువుల రక్షణ కోసం బజరంగ్‌దళ్ అహోరాత్రులు పనిచేస్తుందన్నారు. హిందువులను మతం మార్చాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, వీరంతా ఎన్నో కుట్రలు చేస్తున్నారని, అయితే బజరంగ్‌దళ్ ఉన్నంత వరకూ అలాంటి వారి ఆటలు సాగవని నీరజ్ దొనేరియా పేర్కొన్నారు.

భారీ ర్యాలీ.. త్రిశూల్ దీక్ష

బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం జోగిపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. సుమారు 3 వేలకు పైగా కార్యకర్తలు... కాషాయ చొక్కాలు ధరించి.. జై శ్రీరాం నినాదాలతో పట్టణంలోని పలు వీధులగుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నీరజ్ దొనేరియా... ఇక్కడి వాసీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో బజరంగ్‌దళ్ కార్యకర్తలతో త్రిశూల్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్, జిల్లా బజరంగ్‌దళ్ అధ్యక్షుడు ప్రభుకుమా క్షేత్ర, బజరంగ్ దళ్ సంయోజక్ సుభాష్, ప్రాంత సంయోజక్ పుట్టి మల్లేశం, జిల్లా ప్రాంత సహా సంయోజక్ బోడ సుమన్, జిల్లా ధర్మప్రసార ప్రముక్ మేదరి దివాకర్, సహ ప్రముఖ్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చెరకు ఫ్యాక్టరీలను ఎప్పుడు తెరిపిస్తారు?

రైతుబంధును ఎగ్గొట్టిన రాష్ట్ర ప్రభుత్వం

మహిళలకు ఈ సర్కార్ రూ.30వేలు బాకీ

రేవంత్ సర్కార్‌పై మండిపడ్డ ఎమ్మెల్సీ కవిత



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్ని కోట్లైనా ఖర్చుపెట్టి మూతబడిన షుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని.. ఇంకా ఎప్పుడు తెరిపిస్తారని ఎమ్మెల్సీ కవిత సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని సీఎస్ఐలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీమేరకు మెదక్, బోధన్, కోరుట్ల చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మహిళలను నమ్మించి మోసం చేసిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతీ నెల రూ.2500 ఇస్తామని ఇప్పటికీ ఇవ్వలేదని, దీంతో ప్రభుత్వం ఆడబిడ్డలకు రూ.30వేలు బాకీ పడిందన్నారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలను పంపిణీ చేయాలన్నారు. రైతుభరోసాపై కాలాయాపన తగదన్నారు. ప్రధాని మోదీలా వంద రకాల షరతు లు పెట్టే కుట్ర పన్నుతున్నారని, అలా అయితే 30 శాతం మంది రైతులకు కూడా రైతు భరోసా రాదని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం పనుల్లో భాగమైన 19వ ప్యాకేజీ పనులు కేసీఆర్‌పై కోపంతో నిలిపివేయడం దారుణమన్నారు. ఆయనపై కోపంతో ప్రజలు, రైతులను ఇబ్బందులు పెడతారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ వెంట పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నాయకులు మఠం భిక్షపతి, రాజీవ్‌సాగర్, లావణ్యారెడ్డి, మల్లిఖార్జున్‌గౌడ్, కృష్ణారెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, వంజరి జయరాజ్, ఆర్కే శ్రీనివాస్, భీమరి కిషోర్, అంజాగడ్, లింగారెడ్డి, కృష్ణాగౌడ్, జుబేర్ తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

భవిష్యనిధి ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి సదస్సులు

పటాన్‌చెరు, డిసెంబరు, 25 (ఆంధ్రజ్యోతి) : భవిష్యనిధి (ప్రావిడెంట్ ఫండ్) ఖాతాదారుల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు 27న ఉమ్మడి మెదక్ జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ప్రత్యేక సదస్సులను ఆప్కేనిఖత్ కార్యక్రమం కింద నిర్వహిస్తున్నామని పటాన్‌చెరు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్‌అగర్వాల్ పేర్కొన్నారు. రామచంద్రాపురం బీహెచ్‌ఈఎల్ మేయిన్ గేట్ వద్ద, మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో, సంగారెడ్డి పట్టణంలోని కోర్టు వెనక సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9-30 నుంచి సాయంత్రం 5-45 గంటల వరకు కేంద్రాలను నిర్వహిస్తామని, సమస్యలు ఉన్నవారు సరైన గుర్తింపు పత్రాలతో శిబిరాలకు హాజరుకావాలని సూచించారు.

అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అందోలులోని సాంఘిక బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పార్ట్‌టైం అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్, ఖేడ్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ప్రిన్సిపల్ లింగారెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బాటనీ సబ్జెక్టును బోధించడానికి జూనియర్ అధ్యాపకురాలు, అంగ్లం, గణితం, తెలుగు బోధించడానికి పీజీటీ, భౌతికశాస్త్రం, గణితం, తెలుగు, బయోలజీ, సాంఘీకశాస్త్రం బోధించడానికి టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు 27న ఆందోలు గురుకులంలో నిర్వహించనున్న డెమో తరగతులకు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ఆర్థిక సహాయం అందజేత



పారమ్మకు నగదు సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నారాయణఖేడ్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్ద మండలం ఉట్‌పల్లికి చెందిన పారమ్మ భర్త హావప్ప ఇటీవల మృతిచెందాడు. వారి కుమార్తె కావేరి వివాహం కోసం పారమ్మ పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నప్పటికీ, ఆమెకు రూ.50 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఖేడ్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో పారమ్మకు ఫౌండేషన్ ప్రతినిధులు నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కంగ్టి మండలం నాగూర్.బి గ్రామానికి చెందిన అందుగుల మారుతి ఇటీవల మృతి చెందగా కుటుంబం ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని రూ.10 వేల సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మారుతి, పండరియాదవ్, గంగారాం, సత్యపాల్‌రెడ్డి, ప్రభాకర్, అంజయ్యసాగర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చిన్నశంకరంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్‌తండాలో సానిక్ష ఫౌండేషన్, నెహ్రూ యువ కేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు క్రీడా సామగ్రి, నోటు పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. సానిక్ష ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గుడ్ గవర్నెన్స్ డే మేరా భారత్ ప్రోగ్రాంలో భాగంగా గిరిజన మొదటి ఎంపీ స్వామినాయక్ జన్మదిన సందర్భంగా ఫ్రీ ట్యూషన్ సెంటర్ క్రీడా సామగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు ధనావ శివ, న్యాయవాది రమేష్‌నాయక్, సభ్యులు స్వరూప, చరణ్, వరుణ్ పాల్గొన్నారు.

జోగిపేట తరలిన బజరంగ్‌దళ్ కార్యకర్తలు


శౌర్యయాత్ర కోసం తరలివెళ్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

నారాయణఖేడ్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జోగిపేటలో బుధవారం నిర్వహించిన బజరంగ్‌దల్ శౌర్యయాత్ర త్రిశూల్ కార్యక్రమంలో పాల్గొనడానికి నారాయణఖేడ్ నుంచి బజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. హైందవ ధర్మ పరిరక్షణ కోసం శౌర్యయాత్ర త్రిశూల్ దీక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు బజరంగ్‌దళ్ బాధ్యులు తెలిపారు.


జహీరాబాద్‌లోని మెథడిస్ట్ చర్చి ప్రాంగణంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీమంత్రి చంద్రశేఖర్ తదితరులు


పటాన్‌చెరులోని మరనాత చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి శివారులోని రాక్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న డీఆర్‌వో పద్మజారాణి

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా ఆయా చర్చిల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా వేడుకల్లో ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, మహిపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

- న్యూస్ నెట్‌వర్క్

కల్హేర్ మండలం బీబీపేట్ సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనల అనంతరం కేక్ కోస్తున్న భక్తులు




క్రిస్మస్ వేడుకల సందర్భంగా పెద్దశంకరంపేటలోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో గల మెథడిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్

ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె ఉధృతం

- 19వ రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె


సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా ఉద్యోగులపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు స్పష్టం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరవధిక సమ్మె 19వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో ఉద్యోగులను విలీనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాకు తరలిరావాలి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా, కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు టీపీటీఎఫ్ శ్రేణులు, ఉద్యోగులు తరలిరావాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం సమ్మె శిబిరం వద్ద కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాంచందర్, సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల అరెస్టు

మెదక్ అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ పర్యటన నేపథ్యంలో తమను క్రమబద్ధీకరించాలని సమ్మెచేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు భద్రత కారణాల పేరు చెప్పి టెంట్లు తీసివేయించారు. అయినా ఉద్యోగులు కింద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. స్టేషన్‌లో కూడా వారు నిరసన కొనసాగించారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయమని సమ్మెచేస్తే అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఆర్టీసీ 'స్పెషల్' దోపిడీ

- 50 శాతం ఛార్జీల పెంపు

మెదక్ అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ వేళ టీజీ ఆర్టీసీ ప్రయాణికుల జేబులను ఖాళీ చేస్తోంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి వేడుకలకు రాష్ట్ర నలుమూల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ప్రయాణికుల కోసం మెదక్ ఆర్టీసీ స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసింది. ప్రత్యేక బస్సుల పేరుతో టీజీ ఆర్టీసీ నిలువు దోపిడీకి పాల్పడుతోంది. ప్రయాణికుల నుంచి 50 శాతం మేర అదనపు ఛార్జీలను వసూలు చేస్తోంది. దీనిపైన ప్రయాణికులు ప్రభుత్వం, టీజీ ఆర్టీసీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెదక్ నుంచి జేబీఎస్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీ సాధారణ రోజుల్లో 140 కాగా.. స్పెషల్ బస్సు పేరుతో ఒక్కో టికెట్ రూ.210కి రేట్ పెంచి అదనంగా రూ.70 వసూలు చేస్తున్నారు. అదే డీలక్స్ బస్సుకు రూ.160 నుంచి రూ.240, ఆర్డినరీ బస్సుకు రూ.100 నుంచి రూ.150 అంటే 50 శాతం అదనంగా ఆర్టీసీ వసూలు చేస్తోంది. ఇదేమిటని ప్రశ్నిస్తే... మాకు వచ్చిన ఆదేశాల మేరకు వసూలు చేస్తున్నామని కండక్టర్లు చెబుతున్నారు. రద్దీకి తగట్టుగా బస్సులు లేవని ప్రయాణికులు వాపోతున్నారు.



ఐడీపీఎల్ నుంచి మెదక్‌కు ప్రయాణికుల వద్ద ఆర్టీసీ వసూలు చేసిన టికెట్

రెగ్యులర్ సర్వీసుల స్థానంలో..

మెదక్ డిపో పరిధిలో నడిపే ఎక్స్‌ప్రెస్, డీలక్స్, ఆర్డినరీ బస్సులను ఆర్టీసీ స్పెషల్ బస్సుల పేరుతో వివిధ ప్రాంతాలకు నడుపుతోంది. వేడుకలకు సందర్భంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయకుండా రెగ్యులర్ సర్వీసులకూ అదనపు ఛార్జీలు వసూలు చేస్తుండడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

సీఎంకు స్వాగతం పలికిన నాయకులు


కొల్చారం: సీఎంకు స్వాగతం పలికేందుకు వచ్చిన నేతలు

కొల్చారం/శివ్వంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వన దుర్గామాత దైవ దర్శనానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హెలికాప్టర్ వద్ద నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శేఖర్‌తో పాటు జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఏడుపాయల వనదుర్గామాత దర్శనానికి వచ్చిన సీఎంను శివ్వంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, పులిమామిడి నవీన్‌గుప్తా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

సీపీఎం రాష్ట్ర సదస్సుకు విరాళం


సీపీఎం రాష్ట్ర నాయకుడు మల్లికార్జున్‌కు విరాళం అందజేస్తున్న ఏషియన్ పెయింట్స్ కార్మిక నాయకులు

పటాన్‌చెరు, డిసెంబరు, 25 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలకు పటాన్‌చెరు ఏషియన్ పెయింట్స్ కార్మికులు విరాళం అందజేశారు. బుధవారం పటాన్‌చెరు శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు, మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జే.మల్లికార్జున్‌కు సీఐటీయూ ఏషియన్ పెయింట్స్ కార్మిక సంఘం నాయకులు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం మహాసభలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా సాగుతున్న ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాజయ్య, ఏషియన్ పెయింట్స్ సీఐటీయూ నాయకులు రాజు, బీ.శ్రీనివాస్‌రెడ్డి, రాజా, ముత్యాలయ్య, గట్టయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం


ఖేడ్ పట్టణంలోని నాల్గవ వార్డులో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్

నారాయణఖేడ్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ అన్నారు. బుధవారం నాల్గవ వార్డులో సీసీరోడ్డు పనులను కౌన్సిలర్ రాజేష్‌చౌహాన్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పన కోసం ప్రధాన సమస్యలైన సీసీరోడ్డు, మురుగు కాల్వల నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి భారత రాజ్యాంగమే రక్ష



సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశానికి అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే రక్షణగా నిలుస్తుందని కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనుస్మృతి సమాజంపై అనేక ఆంక్షలు విధించినదని, వర్ణ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. ఈ క్యాక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, ఉదయ్, ప్రవీణ్, శ్రీకాంత్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమం మరిచిన రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరిచిందని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి విమర్శించారు. సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గడిచి ఏడాది గడుస్తున్నా కార్మికశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఏడాదికాలంగా బోర్డు నుంచి అందాల్సిన పథకాలు అందడం లేదన్నారు. ఎంఆర్‌ఎఫ్ అంకెనపల్లి పరిశ్రమలో శ్రమదోపిడీ, పని ఒత్తిడి ఎక్కువవుతుందని కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎంఆర్‌ఎఫ్‌పై కేంద్ర కార్మిక మంత్రి, మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పటాన్‌చెరు మండల కార్యదర్శి శ్రీనివాస్, వేలగోరో పరిశ్రమ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు నాణ్యమైన కాంటాల సరఫరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకోమారు రేషన్ షాపులకు అందిస్తున్న కాంటాలు నాసిరకంగా సరఫరా చేస్తుండటంతో సాంకేతిక పరంగా తూకంలో తేడాలు వచ్చి రేషన్ డీలర్లు ఆందోళనలో పడ్డారు. ఇటీవల 'ఏళ్లుగా కాంటా సమస్యలే ' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కాంటా సరఫరా చేసే టెండర్‌దారులు స్పందించారు. ఈ మేరకు డీలర్లకు నాణ్యమైన ఫోనిక్స్ కంపెనీకి చెందిన కాంటాలు అందించడంతో రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో 13 రేషన్‌షాపులకు గతంలో నాణ్యతలేని ఓపాస్ కాంటాలు అందించడంతో రేషన్ లబ్ధిదారులకు బియ్యం అందించే క్రమంలో తూకంలో తేడాలొస్తూ అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. పలుమార్లు టెక్నీషియన్‌కు ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేక పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. మండలంలోని 13 షాపులకుగానూ మొదటగా మద్దూరు, నర్సాయపల్లి, గాగిల్లాపూర్, సలాఖపూర్‌తో పాటు మద్దూరులోని మరోషాపుకు నాణ్యమైన ఫోనిక్స్ కంపెనీకి చెందిన కాంటాలు అందించారు. మిగతా 8 షాపులకు సరఫరా చేయాల్సి ఉంది.

దళిత సంఘాల ఆధ్వర్యంలో.. మనుస్మృతి ప్రతుల దహనం

సిద్దిపేట రూరల్/గజ్వేల్ రూరల్/మిరుదొడ్డి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మనుధర్మశాస్త్రం ముసుగులో రాజ్యాంగంపై విషం చిమ్ముతున్నారని జిల్లాలోని పలు మండలాల్లో దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు చేగురి కృష్ణ అధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. గజ్వేల్ మండలంలోని అనంతరావుపల్లి గ్రామంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ఆధ్వర్యంలో నాయకులు మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. మిరుదొడ్డిలో కులనిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో మనుధర్మశ్రాస్త్రం ప్రతులను దహనం చేశారు. కేఎన్‌పీఎస్ నాయకులు భిక్షపతి, యాదగిరి పాల్గొన్నారు.


అనంతరావుపల్లిలో మనుస్మృతి దహనం చేస్తున్న దృశ్యం


పెద్దశంకరంపేటలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



అటల్ బిహారి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు


జహీరాబాద్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం

దివంగత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. వాజ్‌పేయి శత జయంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాల్గొని వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతోందన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్